క్లుప్తంగా

నేడు గృహ సారథులకు అవగాహన సదస్సు

• హాజరుకానున్న మంత్రి కాకాణి

పొదలకూరు: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఉన్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని ద్వారకామయి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తారని సచివాలయాల మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

బాబాకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే సాయంత్రం మందిరంలో భక్తులు సాయి భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఎస్సై పరీక్షకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ సందీప్‌కుమార్

కోవూరు: మండలంలోని గంగవరం వద్ద ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 19న నిర్వహించనున్న ఎస్సై పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఆ కళాశాలలో ఎస్సై రాత పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విభాగం రీజినల్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షను పోలీసు శాఖ సమన్వయ, సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని, చెడు మార్గంలో పయనించకుండా జాగ్రత్త పడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. 'మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' అనే అంశాలపై శుక్రవారం మండలంలోని చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఈబీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను వినియోగించి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొంటున్నారన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉదయకళేశ్వరస్వామికి సింహ వాహనసేవ



సింహ వాహనంపై కొలువైన స్వామివారు

కొడవలూరు: మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతీ సమేత ఉదయకళేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సింహ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. సింహ వాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య, నిర్వాహక కమిటీ సభ్యుడు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామివారికి రావణసేవ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ప్రతి కుటుంబాన్ని పలకరించాలి

• సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
• గృహసారథులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచన



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పనితీరును క్షేత్రస్థాయిలో తెలుసుకొనేందుకు గృహ సారథులు ప్రతి కుటుంబాన్ని పలకరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ముత్తుకూరులో గురువారం జరిగిన గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. చంద్రబాబు అమలు చేయలేని పథకాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాల మధ్య వ్యత్యాసాన్ని వివరించాలని సూచించారు. ఈ దశలో వైఎస్సార్‌సీపీని మరింత పటిష్టం చేయాలని తెలిపారు. పార్టీకి, ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరించాలని తెలిపారు.

కుట్రలకు దీటుగా..

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే పచ్చ మీడియా మాత్రం కక్షకట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచురిస్తోందంటూ మంత్రి కాకాణి మండిపడ్డారు. చంద్రబాబును గద్దెపై కూర్చోబెట్టాలన్న ఈ కుట్రను తిప్పికొట్టేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. ఒక వేళ ప్రజలు సమస్యలేవైనా ప్రస్తావిస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. మార్చి 20వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గం పరిశీలకురాలు కోడూరు కల్పలత, మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు జనార్దన్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కోఆర్డినేటర్లు

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

• ఎస్పీ విజయారావు



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

కొడవలూరు: మండలంలోని గండవరం ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సీహెచ్ విజయారావు తెలిపారు. గండవరంలోని గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామిని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే ప్రసిద్ధి పొందిన ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవాలకు వేలాదిగా భక్తులు రానున్నారన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన 18, 19, 20వ తేదీల్లో జరిగే ఉత్సవాలకు భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తగినంత మంది పోలీసు సిబ్బందిని నియమించడంతోపాటు అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశామన్నారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులు, అనంతరం వెళ్లే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశామన్నారు. అధిక రద్దీ ఉండే రథోత్సవం, తెప్పోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తయ్యేందుకు స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, అడిషనల్ ఎస్పీ హిమవతి, డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, సీఐలు జి.రామారావు, కె.రామకృష్ణారెడ్డి, ఎస్సై జి.సుబ్బారావు, ఈఓ బండి శాంతయ్య, నిర్వాహక కమిటీ సభ్యుడు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మడమనూరులో 'గడప గడపకు..'

మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామంలో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పన్నుల వసూలు పూర్తి చేయాలి

• జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి

కొడవలూరు : మార్చి ఆఖరు కల్లా ప్రతి పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నుల వసూలు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి సూచించారు. కొడవలూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు 40 రోజుల గడువు ఉన్నందున ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వసూళ్లలో వెనుకబడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నందున ఈ కార్యక్రమం అన్ని పంచాయతీల్లో విజయవంతంగా జరగాలన్నారు. ప్రతిఇంటి నుంచి చెత్త సేకరించడంతోపాటు చెత్తతో సంపద కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వానపాముల ఎరువును విధిగా ఉత్పత్తి చేయాలని చెప్పారు. ఇప్పటికీ వినియోగంలోకి రాని కేంద్రాలుంటే వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ ఆదినారాయణ, ఎంపీడీఓలు పి.సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శీనానాయక్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కావలి ఆర్డీఓ శీనానాయక్ విడవలూరులోని పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విడవలూరు మండలంలో 1,358 మంది పట్టభద్రులు, 68 మంది ఉపాధ్యాయులు ఓటు వినియోగించుకోనున్నారని తెలిపారు. పట్టభద్రుల కోసం 2 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో అవసరమైన వసతులను కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్సై ఆంజనేయులు, వీఆర్వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైఎస్సార్ హయాంలోనే మత్స్యకార గ్రామాల అభివృద్ధి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్రంలో మత్స్యకార గ్రామాల అభివృద్ధి జరిగిందంటే అది కేవలం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమే అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సంబంధించి విడవలూరులోని సాయిబాబా కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు గురువారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇటీవల టీడీపీకి చెందిన ఓ నాయకుడు గ్రామాల్లో పర్యటించి మత్స్యకార గ్రామాలను అభివృద్ధి జరిగింది టీడీపీ హయాంలోనే అని అసత్య ప్రచారాలు చేశారని మండిపడ్డారు. సునామి సమయంలో మత్స్యకార గ్రామాలు పూర్తిగా దెబ్బతినడంతో ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక కమిటీని వేసి ఆ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారని, వైఎస్సార్ చొరవతోనే కేంద్ర ప్రభుత్వం రూ.1,750 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధుల్లో కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని మత్స్యకార గ్రామాల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతోనే ప్రస్తుతం మత్స్యకార గ్రామాలు సుందరంగా ఉన్నాయని గుర్తుచేశారు. నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వారికి కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. టీడీపీకి చేస్తున్న మీడియాపై కూడా పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, ఎంపీపీ భవానమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాజ్‌వే మొదలుపెట్టి తీరుతాను

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం, విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామాల మధ్య పెన్నానదిపై కాజ్‌వే నిర్మాణాన్ని మొదలు పెట్టి తీరుతానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మొత్తలు గ్రామంలో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, అతని కుమారుడు, ఆయన భజనపరులు కొంతమంది పత్రికా విలేకరుల సమావేశాలు పెట్టి ముఖ్యమంత్రిని, తనను, పార్టీ నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఏ గ్రామంలో వెతికినా టీడీపీకి నాయకులు, కార్యకర్తలు లేరన్నారు. కాజ్‌వే నిర్మాణం ఆగిపోయిందని అయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులను రద్దు చేసిందని పోలంరెడ్డి బుచ్చిలో మాట్లాడారని, అయితే అవి రాష్ట్రం ప్రభుత్వం నిధులు అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి అనుమతులు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. మార్చి 16వ తేదీ తరువాత టెండర్లు పిలుస్తామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ఎక్కడైనా హైలెవల్ బ్రిడ్జి ఉన్నా, కాంక్రీట్ రోడ్లు నిర్మించినా.. అది నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కృషితోనే అని గుర్తుచేశారు. నెల్లూరు రూరల్ తరువాత కోవూరు నియోజకవర్గంలో అధికంగా పట్టభద్రుల ఓట్లు నమోదు చేసినందుకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబు రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బీవీ రమణయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, నాయకులు దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉడతా వెంకటశేషయ్య, గూడూరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

55 వేల కోట్లతో విద్యావ్యవస్థ అభివృద్ధి

• ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందని వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి విడవలూరులోని సాయిబాబా కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నానని, ఈ సారి ప్రైవేట్ టీచర్లకు కూడా ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారని తెలిపారు. దాదాపు ఆరు జిల్లాల్లోని 36 నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, ఆయన సారథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తనతోపాటు తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో విడవలూరు సర్పంచ్ ప్రవీణ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, మురళి, శశి, సురేంద్రరెడ్డి, తాతా ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వివేకానందరెడ్డి, అయ్యప్ప, మల్లికార్జున్‌రావు, శ్రీధర్, మస్తానయ్య, రాధయ్య, తిరుపతి, శ్రీనివాసులు, ఆవుల వాసు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కరుణాకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వేలం పాటల నిర్వహణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో పలు అంశాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ కొబ్బరి చిప్పలను సేకరించుకునే హక్కును రూ.17,30,000లకు, వస్త్రాలు సేకరించుకునే హక్కును రూ.17,38,000లకు, చాపలు, పీటల విక్రయ హక్కును రూ.80 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే ఖాళీ నూనె డబ్బా(ఒకటి రూ.21 చొప్పున)ల సేకరణ హక్కు, అదేవిధంగా షీల్డ్ టెండర్ల ద్వారా పారిశుద్ధ్యం, ప్లంబింగ్ సామాన్ల సరఫరా, శేషవస్త్రాలు, అరిటాకులు, కరెంట్ సామాన్ల సరఫరా హక్కుల కోసం వేలం పాటలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు రాజు, వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు ముంగర శివకుమార్ పాల్గొన్నారు.

పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం

• హౌసింగ్ పీడీ వెంకటప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ వెంకటప్రసాద్

మనుబోలు: సొంతిల్లు లేని పేదలందరికీ గూడు కల్పించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హౌసింగ్ పీడీ వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని పిడూరు గ్రామంలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం గృహనిర్మాణశాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాల కోసం రూ.318 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 69,087 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 19,269 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో, 2,434 ఇళ్లు రూఫ్ లెవల్, 2,705 శ్లాబ్ నిర్మాణం పూర్తయిన ఇళ్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గ్రామీణ్ పథకం ద్వారా 13,035 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. పిడూరు లేఅవుట్‌లో పనుల్లో జాప్యం జరుగుతోందని, త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మనుబోలులో గిరిజనులకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పి మెటీరియల్‌తో పరారైన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయించి మెటీరియల్‌ను రికవరీ చేయాలని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ వరప్రసాద్, మనుబోలు, సైదాపురం ఏఈలు రవికుమార్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని..

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నెల్లూరుకు చెందిన సుధాకర్‌రావు పనినిమిత్తం బైక్‌పై గొలగమూడి వచ్చి, తిరిగి నెల్లూరుకు వెళుతుండగా, సర్వేపల్లి కాలువ వద్ద ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్‌రావుకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణ పూజలు



శేషవాహనంపై ఆసీనులైన కల్యాణ వెంకటేశ్వరస్వామి



నరసందిపై కొలువుదీరిన వీరబ్రహ్మేంద్రస్వామి

• ఆరంభమైన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రామకృష్ణానగర్‌లో వెలసిన శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయం ముందున్న ధ్వజస్తంభానికి కొడిగుడ్డను కట్టి దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించారు. అలాగే అగ్నిప్రతిష్ఠ, ద్వారతోరణ పూజ, యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, మహాకుంభ ఆవాహన, నిత్యపూర్ణాహుతి, మంగళా శాసనమ్ తదితర పూజలు నిర్వహించారు.

శేషవాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడు

ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి శేషవాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి చెవ్వ సంపూర్ణమ్మ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించగా పాలకమండలి సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

ఇస్కపాళెంలో..

మండలంలోని ఇస్కపాళెంలో వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి – గోవిందమాంబ, ఈశ్వరీదేవి మఠంలో జరిగిన ఉత్సవాల్లో వీరబ్రహ్మేంద్రస్వామికి గురువారం నరసందిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. అర్చకుడు ఆదిశేషయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా పోలీసుకు గాయాలు

కోవూరు: స్కూటీని బైక్ ఢీకొని స్థానిక సచివాలయం–3లో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న పొంగూరు శిరీషకు గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని గంగవరంలో నివాసం ఉంటున్న పొంగూరు శిరీష కోవూరులోని సచివాలయం–3లో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. గురువారం ఉదయం విధులకు వెళ్లేందుకు గంగవరం కాలువ మీదుగా స్కూటీపై బయలుదేరింది. గంగవరం కాలువ వద్ద ఆగి ఉన్న శిరీష స్కూటీని బుచ్చి నుంచి నెల్లూరుకు వస్తున్న బైక్ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శిరీషకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్సనిమిత్తం శిరీషను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శివయ్య బ్రహ్మోత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని శతాబ్దాల నాటి శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

కాశీనాయన ఆశ్రమంలో..

మండలంలోని వరదాపురానికి సమీపంలో ఉన్న కాశీనాయన ఆశ్రమంలో పూజలందుకుంటున్న పంచలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వరస్వామి గురువారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పంచలింగాలకు, కాశీనాయనకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సంతానలక్ష్మి యాగం, సిద్ధేశ్వరస్వామి సత్యబోధన ప్రసంగం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.